ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 184 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 11 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ఎల్ నినో నేపథ్యంలో తీవ్రమైన ప్రమాదం

### సంక్షోభాన్ని గుర్తించకపోతే భవిష్యత్తులో అంధకారం

### గ్రామస్థాయి నుండి ప్రజలను అప్రమత్తం చేయాలి

### ప్రమాదం నుండి బయటపడేందుకు ఎనిమిది నెలల యాక్షన్ ప్లాన్

### విద్యుత్ ఆధారిత పనులను వాయిదా వేయాలి

### వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ సమీక్ష



**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు.ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తుచేశారు. విబి జి రాంజీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అవసరమైతే అఖిలపక్ష ..మిగతా 2లో



### నవంబర్ 2వ వారం నుంచి
## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహిం చిన సవిరీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను ..మిగతా 2లో

### ఈసీకి మాజీ ఐఏఎస్‌ల
## మద్దతు
### బహిరంగ లేఖ

2




# పండుగ చేసుకోలేం..!

### ఆర్థిక స్థోమత సరిపోవడం లేదు

### 53.6 శాతం భారతీయలు వెల్లడి

### ఆర్థిక ఒత్తిడిలో సగానికిపైగా కుటుంబాలు

### 11.6 శాతమ మందికి మాత్రమే ఓకే

### సీ - ఓటర్ జాతీయ సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

రాబోయే పండుగ సీజన్‌లో కొత్త వస్తువులు కొనడానికి, ప్రయాణాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నప్పటికీ, పెరిగిన కుటుంబ ఖర్చులు, ఆర్థిక అనిశ్చితి భారతీయ వినియోగదారుల ఉత్సాహంపై నీళ్లు చల్లుతున్నాయి. ముఖ్యంగా భారీ ఖర్చులతో కూడిన వస్తువుల కొనుగోలుకు సామాన్యులు వెనుకంజ వేస్తున్నారని సీవోటర్ నిర్వహించిన జాతీయ సర్వేలో వెల్లడైంది. తక్కువ ఆదాయ వర్గాల ప్రజలు తమ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతుండగా, ఉన్నత ఆదాయ వర్గాలు మాత్రం భవిష్యత్తుపై ధీమాతో ఉన్నాయని ఈ సర్వే వివరాలు చెబుతున్నాయి. సర్వేలో వెల్లడైన అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. దేశంలో సగానికి పైగా కుటుంబాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 53.6 శాతం ..మిగతా 2లో



## పండగ నేపథ్యంలో కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు

### అదనపు బస్సులు నడపాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్‌లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్‌ఆర్టీసీ ప్రకటించింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్ తదితర కూడళ్ల నుంచి కూడా ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. రద్దీ దృష్ట్యా ..మిగతా 2లో






# నిర్బంధం!

### నలుగురు సీఎంలు, 7వేల కార్యర్తలు అదుపులోకి

### సీజేపీ నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం

### దేశ రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత

### మోదీ, షా నియంతృత్యమన్న ప్రియాంక, రాహుల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక ..మిగతా 2లో

## రెండో దశ జనగణనకు షెడ్యూల్

### 40 ప్రశ్నలతో జాబితా ఖరారు

### వచ్చే జనవరి 10 55 రోజుల వరకు గడువు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

దేశం అభివృద్ధి చెందాలంటే జనాభా ఎంతమంది ఉన్నారో స్పష్టంగా లెక్క తెలియడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే, సంక్షేమ పథకాల అమలుతో పాటు అనేక అంశాలకు ఇవే ప్రామాణికం. పరిపాలనా వ్యవస్థ సులభతరం చేసేందుకు ఇవి దోహదపడతాయి. ఐదు సంవత్సరాల క్రితమే జనగణన జరగాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడింది. అప్పటి నుంచి మేధోమథనం చేసిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు జనాభా లెక్కలను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని రెండు విడుతల్లో డిజిటల్ విధానంలో 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబర్) చేపట్టారు. ఈ మేరకు ఏప్రిల్ 1న ఇది ప్రారంభమైంది. మొత్తం 33 ప్రశ్నల ఆధారంగా వివరాలు నమోదు చేశారు. ఏపీలో ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకూ ..మిగతా 2లో

### రాష్ట్రంలో ఘనంగా ఎంగిలిపూల
## బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో, సాంప్రదాయ దుస్తులతో మహిళలు, చిన్నారులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల ..మిగతా 2లో



# పండుగ చేసుకోలేం..!

**మొదటి పేజీ తరువాయి...**

మంది తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి గతేడాదితో పోలిస్తే 'మరింత' క్షీణించిందని తెలిపారు. కేవలం 11.6 శాతం మంది మాత్రమే తమ పరిస్థితి మెరుగైందని పేర్కొనగా, 27.1 శాతం మంది ఎలాంటి మార్పు లేదని చెప్పారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో 2,051 మంది ప్రతినిధుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.




**గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం..**

ఆర్థిక ఒత్తిడి విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 40.6 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని చెబితే, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య ఏకంగా 59.2 శాతానికి చేరింది! రాబోయే ఏడాదైనా పరిస్థితులు చక్కబడతాయా అంటే నిరుత్సాహమే వ్యక్తమవుతోంది. కేవలం 24.4 శాతం మంది మాత్రమే భవిష్యత్తులో పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తుండగా, 38 శాతం మంది పరిస్థితులు మరింత దిగజారుతాయని భయపడుతున్నారు. తక్కువ ఆదాయ వర్గాల్లో ఏకంగా 63.2 శాతం మంది ఆర్థిక ఇబ్బందులు పెరిగాయని చెప్పగా, ఉన్నత ఆదాయ వర్గాలలో ఈ శాతం కేవలం 26.3గా ఉంది.

**దుస్తులు, సాంప్రదాయ మిఠాయిలకే ప్రథమ ప్రాధాన్యం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పండుగ సంప్రదాయాలను పాటించడంలో భారతీయులు వెనక్కి తగ్గడం లేదని సీవోటర్ సర్వే ద్వారా తెలుస్తోంది. 45 శాతం మంది కుటుంబ సభ్యుల కోసం కొత్త దుస్తులు కొనుగోలు చేశామని లేదా కొనడానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇందులో 16.9 శాతం మంది కుటుంబం మొత్తానికి, 20.4 శాతం మంది పిల్లల కోసం దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. అయితే, 45.4 శాతం మంది ఈసారి కొత్త బట్టలు కొనే ఆలోచన లేదని చెప్పడం.. మారిన బడ్జెట్ పరిమితులను సూచిస్తోంది. స్వీట్ల విషయంలో విదేశీ చాక్లెట్ల కంటే స్థానిక మిఠాయిలకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. 33 శాతం మంది స్థానిక షాపుల్లో సాంప్రదాయ తీపి పదార్థాలు కొంటామని చెప్పగా, విదేశీ చాక్లెట్లను ఎంచుకున్నది కేవలం 3.1 శాతం మంది మాత్రమే. ఇది స్థానిక వ్యాపారులకు ప్రాధాన్యత ఇచ్చే వైఖరిని ప్రతిబింబిస్తోంది.

**భారీ కొనుగోళ్లకు దూరంగా సామాన్యుడు..**

పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన వస్తువుల విషయంలో భారతీయ వినియోగదారులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కేవలం 21.5 శాతం మంది మాత్రమే వంటగది ఉపకరణాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపగా, 18.5 శాతం మంది ఎలక్ట్రానిక్స్ వస్తువులపై దృష్టి పెట్టారు. ద్విచక్ర వాహనాలు, కార్లు లేదా పసిడి ఆభరణాలు కొనాలని 22 శాతం మంది భావిస్తున్నారు. ఇళ్లకు రంగులు వేయడం, మరమ్మతులు చేయడం వంటి పనులకు 50.2 శాతం మంది దూరంగా ఉంటున్నారు. చెల్లింపుల విషయంలో కూడా 32.2 శాతం మంది నేరుగా పూర్తి నగదు చెల్లిస్తామని చెప్పగా, 12.8 శాతం మంది ఈఎంఐ పద్ధతిని ఎంచుకుంటున్నారు. 32.1 శాతం మంది ఏ విధమైన భారీ కొనుగోళ్లు చేయడం లేదని స్పష్టం చేశారు.

**దేశీయ, ఆధ్యాత్మిక ప్రయాణాల వైపే మొగ్గు..**

పండుగ సెలవుల్లో ప్రయాణాల విషయానికి వస్తే, 47.5 శాతం మంది కుటుంబంతో కలిసి ప్రయాణాలు చేయడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. అందులో స్థానిక ప్రాంతాలకు వెళ్లేవారు 15.7 శాతం ఉండగా, 15.1 శాతం మంది పుణ్యక్షేత్రాల సందర్శనకు (ఆధ్యాత్మిక యాత్రలకు) ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈసారి విదేశీ ప్రయాణాలకు కేవలం 1.7 శాతం మంది మాత్రమే ఆసక్తి చూపారు. దీనిబట్టి పండుగ వేళ సుదూర ప్రాంతాలు, విదేశాల కంటే స్వదేశీ, ఆధ్యాత్మిక ప్రయాణాలకే డిమాండ్ ఎక్కువగా ఉందని స్పష్టమవుతోంది. భారత కుటుంబాల్లో కనిపిస్తున్న ఆర్థిక ఒత్తిడికి ప్రధాన కారణం.. ఈ ఏడాది మార్చ్‌లో ప్రారంభమైన అమెరికా-ఇరాన్ యుద్ధమే. దీని వల్ల ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీని వల్ల దేశవ్యాప్తంగా నిత్యావసర ధరలకు రెక్కలు వచ్చాయి. వీటి వల్ల సామాన్యుడి ఆర్థిక ప్రణాళికలు చితికిపోతున్నాయి.

# నిర్బంధం!

**మొదటి పేజీ తరువాయి...**

కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి ఢిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.



**కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

**వామపక్ష నేతలూ అదుపులోకి**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

**ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే**

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ- ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. "మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు" అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. "భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం" అని ఖర్గే తెలిపారు.

**మోదీ, షా నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ**

భారత్ ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ-అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. "మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు" అంటూ ఆరోపణలు చేశారు.

**సుప్రీంకోర్టులో విచారణ**

ఢిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

# పండగ నేపథ్యంలో కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు

**మొదటి పేజీ తరువాయి...**

శనివారం నుంచి ఈ నెల 22 వరకు 1300 బస్సులను వివిధ జిల్లాలకు నడిపేలా గ్రేటర్ ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం 50 అదనపు బస్సులను పంపినట్టు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సివస్తోందని వాపోతున్నారు. మరిన్ని బస్సులు నడిపి తమను గమ్యస్థానాలకు చేర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. జేబీఎస్ నుంచి ఈ నెల 10 నుంచి 13 వరకు సాధారణ సర్వీసులతో పాటు రోజుకు వంద, 16, 17, 18 తేదీల్లో 300 నుంచి 400 అదనపు సర్వీసుల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చనున్నట్టు పికెట్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి రోజూ 3400 సర్వీసులను ఆర్టీసీ నడుపుతుండగా పండగ నేపథ్యంలో మరో 1000 బస్సులను అదనంగా నడపాలని ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించింది. ఆర్టీసీ బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అందిన కాడికి దండుకుంటున్నారు.

# రెండో దశ జనగణనకు షెడ్యూల్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత మే 1 నుంచి మే 30 వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా ఎన్ని ఇళ్లు ఉన్నాయి? అందులో బిల్డింగ్ మెటీరియల్స్ వివరాలు నమోదు చేశారు. అంటే ఫ్లోరింగ్, వాల్, రూఫ్, విద్యుత్ సౌకర్యాలు వంటివి ఉన్నాయా అన్నది చెక్ చేశారు. అలాగే సెల్‌ఫోన్స్, టీవీలు, రేడియోలు సహా ఇతరత్రా గ్యాడ్జెట్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం వంటివి నమోదు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లు ఇతర వాహనాలతో పాటు తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరించారు. ఒకవేళ ఇంటి నంబర్లు లేకపోతే జనగణన ప్రక్రియ కింద ప్రత్యేక నంబర్లు వేసి ఇళ్ల జాబితాలో చేర్చారు. ఈ క్రమంలోనే ఇప్పుడు రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)ను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఆన్‌లైన్ స్వీయగణనను 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ 15 రోజుల వ్యవధిలో ఈ స్వీయగణన నమోదుకు వీలుంది. ఇంటింటి గణనకు 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు వ్యవధి ఇచ్చారు. 35 రోజుల పాటు ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు. రివిజనల్ రౌండ్ కూడా ఇందులో భాగంగా ఉంటుంది. దీనిని 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈమేరకు జనగణన విభాగం తాజా వివరాలు ప్రకటించింది. మొత్తం 55 రోజుల పాటు రెండోదశ జనగణన నిర్వహిస్తారు. కులగణన కూడా ఈ సమయంలో చేపట్టనున్నారు.

మరోవైపు శుక్రవారం నాడు సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ మృత్యుంజయకుమార్ నారాయణ్ సమావేశాన్నినిర్వహించారు. మొదటి దశలో గృహ జాబితాలు, గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసిన అధికారుల్ని అభినందించారు. అదే స్ఫూర్తితో రెండో దశ కూడా నిర్వహించాలని కోరారు. రెండో దశలో 40 ప్రశ్నలకు సంబంధించిన వివరాలు సేకరించాలని చెప్పారు. మతం, కులం, దివ్యాంగత్వం, వృత్తి తదితర సున్నితమైన అంశాలపై వివరాలు సేకరించేటప్పుడు ప్రజల భావాలను గౌరవించాలన్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉండాలని, వారికి అవసరమైన శిక్షణాకార్యక్రమాలను నిర్వహించాలని మృత్యుంజయకుమార్ నారాయణ్ నిర్దేశించారు.



# నవంబర్ 2వ వారం నుంచి కాళేశ్వరం పనులు

**మొదటి పేజీ తరువాయి...**

పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్ఠం చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియో దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ పరిద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది.

# ఎల్ నినో నేపథ్యంలో తీవ్రమైన ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంఓ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈసీకి మాజీ ఐఏఎస్‌ల మద్దతు బహిరంగ లేఖ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఢిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు.

# రాష్ట్రంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

**మొదటి పేజీ తరువాయి...**



బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఇలా రోజుకొక్క పేర్లతో పిలుచుకుంటూ బతుకమ్మలు తయారు చేసి గౌరీ దేవికీ రోజుకొక రకంగా పిండివంటలు నైవేద్యంగా సమర్పిస్తారు. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి మొదలైన పూలతో చేసిన బతకుమ్మలు నేటి నుంచి ఇంటింటా కనువిందు చేస్తాయ్. పెళ్లైన పడతులు పుట్టింటికి వచ్చి ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఇళ్ల ముంగిళ్లలోనూ ఆలయాలు కూడళ్ల వద్దా, చెరువు గట్టల వద్దా బతుకమ్మలను ఒక్క చోటుకు చేర్చి పాటలు పాడి నృత్యాలు చేస్తారు

**పూలను పేర్చి ఆటపాటలతో సందడి**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతో పాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు. మెదక్ జిల్లాలో పలు గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడి పాడారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**బుద్వేల్, అక్టోబరు 10 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శనివాసం సాయం త్రం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను మహిళలు పెద్ద ఎత్తున నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని ఆదర్శ విద్యాలయ హై స్కూల్ లో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు హేమ, శ్రీదేవి, మహేశ్వరి, పద్మ, మాధవి, సుజాత, ఆస్మ, హైమ, పుష్ప, అనిత, శ్రీలత లు పాల్గొన్నారు. దసరా పండుగ లో మొదటి రోజును ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. బతుకమ్మ కు కావాల్సిన తంగేడు, గునుగు, తామర, బంతి పూలను ఒక రోజు ముందే కోసి తెచ్చి, వాడిపోకుండ నీళ్ల లో వేసి ఉంచుతారు. దాని పూలు నిద్రపోవడం అంటారు. అలా రాత్రంతా నీళ్లలో నానిన పూలతో చేసేదే ఎం గిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. పెత్తర అమవాస్య రోజున పెద్దలకు, పూర్వీకులకు భోజనాలు పెట్టి తర్పనాలు ఇచ్చిన తర్వాతే బతుకమ్మ ను పేరుస్తారు. భోజనం చేసి ఎంగిలి పడ్డాక చేస్తారు కాబట్టి ఎం గిలి పూల బతుకమ్మ అని పేరు వచ్చిందని మహిళలు చెప్పుకుంటారు. ఎంగిలి పూల బతుకమ్మ రోజున బతుకమ్మలను సింపుల్ గా పేరుస్తారని, నువ్వుల పిండి, బియ్యం పిండి, నూకలు నైవేద్యంగా పెడతారని. తమలపాకులు, వాయనం ఇచ్చుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెపుతు ఈ వేడుకలలో పాల్గొన్నారు



రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ లో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు





బతుకమ్మతో చిన్నారి...... పెద్ద తాళ్ళ కుంట వద్ద బతుకమ్మలతో ఓ కుటుంబం



## శ్రీకృష్ణ స్వామిని దర్శించుకున్న జనార్ధన్... కల్యాణ మండపానికి రూ. 1,10,000 విరాళం

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం):**

మల్దకల్ మండలంలోని సద్దనోపల్లి గ్రామంలోని వెలసిన శ్రీ కృష్ణస్వామి దేవాలయాన్ని శనివారం కేటిదొడ్డి మండలం నాయకులు చింతలకుంట జనార్దన్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి ఆలయం వద్ద ఉన్న కల్యాణ మండపానికి అవసరమైన గేటు కొనుగోలు నిమిత్తం ఆయన రూ. 1,10,000 (లక్ష పది వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళం తాలూకు మొత్తాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు పాందు సన్మానించారు.



## కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

### సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటయ్య

**రాజేంద్రనగర్, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)**

కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యాలయం కాటేదాన్ లో సిఐటియు మైలార్ దేవ్ పల్లి, కాటేదాన్ సిఐటియు డివిజన్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటయ్య ,పి సికె భాస్కర్ మాట్లాడుతూ... ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల అవకతవకలు పాల్పడిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని దీనిని ప్రోత్సహించిన మోడీ అమిత్ షా కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని అపహాస్యం చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా దళితులు, క్రిస్టియన్స్, మైనార్టీల ఓట్లు తొలగించే కుట్ర ఈ దేశంలో జరుగుతుందన్నారు .దానికి వ్యతిరేకంగా ఎర్రజెండా సిఐటియు పోరాటం చేస్తుందన్నారు .అలాగే ఈనెల 25, 26 తేదీలలో నగరం లోని ఇందిరా పార్క్ పార్కు వద్ద లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు ఉన్నాయని కాటేదాన్, మైలార్ దేవుపల్లి డివిజన్ లోని సిఐటి నాయకులు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నా విజయవంతం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ నాయకులు బిక్షపతి ,చంద్రయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ ఆలయంలో అమావాస్య భోజనాలు

### అన్నదాన ఏర్పాట్లు చేసిన కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో వెలసిన శ్రీ పోచమ్మ దేవాలయం భక్తిపారవశ్యంతో విలసిల్లుతోంది. గత మూడు సంవత్సరాలుగా భక్తుల సహకారంతో (36 నెలలు) ప్రతి అమావాస్య రోజున ఎలాంటి విరామం లేకుండా వరుసగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం భక్తుల విశేష ఆదరణతో దిగ్విజయంగా కొనసాగుతోంది. తమ కోరికలు తీర్చే ప్రత్యక్ష దైవంగా, నమ్మి కొలిచిన భక్తుల పాలిట కొంగుబంగారమై శ్రీ పోచమ్మ తల్లి కొలువుదీరింది. ఆయురారోగ్యాలతో స్థానిక ప్రజలను, భక్తులను ఎల్లవేళలా చల్లగా చూడాలని, సకల జనులకు అమ్మవారి దివ్య ఆశీస్సులు లభించాలని కోరుకుంటూ ఈ పుణ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయానికి విచ్చేసే ప్రతి ఒక్క భక్తునికి అమ్మవారి ప్రసాదం లభించేలా నిర్వాహకులు ఎంతో శ్రద్ధతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ... ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు ముఖ్యంగా మహిళలు అత్యంత ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. దైవ చింతనతో పాటు సామాజిక సేవా దృక్పథంతో సాగుతున్న ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి దయ మరియు భక్తుల సహకారంతోనే ఈ 36 నెలల అన్నదాన సేవ సాధ్యమైందని, అమ్మవారు నిత్యం ప్రజలందరినీ చల్లగా చూస్తూ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడ ఈ అన్నదాన కార్యక్రమాన్ని మరిన్ని వినూత్న సేవా కార్యక్రమాలతో నిరంతరాయంగా కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దేవి నవరాత్రుల సందర్భంగా 9 రోజులు తీరొక్క అవతారాలతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహిస్తారు కావున భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలర్ దేవ్ పల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ , కిష్టప్ప , బి వెంకటేష్ , కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను , దేవాలయ కమిటీ అధ్యక్షులు సెంట్రింగ్ శంకర్ , మల్లేష్ , కృష్ణ , బొంబాయి రవి , బుచ్చయ్య , కార్తీక్ , ఆనంద్ , భాగ్యమ్మ , కుమార్ , జగన్ , శేఖర్ , లక్ష్మణ్ , మధు చారి , స్థానిక ప్రముఖులు, మహిళలు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న టీ ఎం యు రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ హిదాయత్ అలీ

## రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో ఈయూ కూటమి సంబరాలు

**బుద్వేల్, అక్టోబరు 10 (ప్రభాత ఉదయం)**

ఆర్టీసీ గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికలలో రాజేం ద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో లో రీజియన్, రాష్ట్ర స్థాయి లో ఘన విజయం సాదించిన ఎంప్లాయిస్ యూనియన్ కూటమి యూనియన్లయిన తెలంగాణ మజూర్ యూనియన్ (థామస్ రెడ్డి), నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు శనివారం డిపో ఆవరణలో సంబరాలు చేసుకున్నారు. 595 ఓట్లు ఉన్న రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో పోలయిన 586 ఓట్లలో టీఎంయు కూటమికి రాష్ట్ర స్థాయిలో 340 ఓట్లు, రీజియన్ స్థాయిలో 292 ఓట్లు వచ్చాయి. దీంతో వారు ఘన విజయం సాదించారు. ఈ నేపథ్యం లో శనివారం డిపో ఆవరణలో ఈయు కూటమి సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాలలో టీఎంయు రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం హిదాయత్ అలీ మాట్లాడారు. ఆర్టీసీ ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తే సిబ్బందే దానిని కాపాడుకుంటారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన అన్ని సౌకర్యాలను అం దజేయాలన్నారు. కార్యక్రమంలో టీఎంయు రాజేంద్రనగర్ బస్సు డిపో కార్యదర్శి సీహెచ్ సుదాకర్, అధ్యక్షులు జాన్ మహ్మద్, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి పాపయ్య, అధ్యక్షులు గోపాల్, అగ్రయ్య, బీక్యా, బాల్ రాజ్ పాల్గొన్నారు.



## శ్రమదానంతో ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టిన వాకర్స్

### పరిశుభ్రంగా పర్యావరణహితంగా చింతకుంట..

**రాజేంద్రనగర్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని రాధాకృష్ణ నగర్, కాంతారెడ్డి నగర్ మధ్యల ఉన్న చింతకుంట పార్కులో శనివారం ఉదయం వాకర్స్ ప్లాస్టిక్ ఏరి వేత కార్యక్రమం జరిగింది. ఈ శ్రమదానంలో వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని చింతకుంట లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. స్థానిక జిహెచ్ఎంసి పారిశుద్ధ సిబ్బంది వాకర్స్ కు సహకరించారు. ఒకప్పుడు మురికికుంటగా ఉండి ఇప్పుడు మంచి గుంట గా మారి వలస పక్షులకు ఆలవాలంగా నిలుస్తున్న చింతకుంటలో నీటిని సంరక్షించడానికి అందరూ కలిసి రావాలని వాకర్స్ పిలుపునిచ్చారు. చింతకుంటను పర్యావరణ హితంగా అద్భుతమైన నేచురల్ పార్కుగా తీర్చిదిద్దడానికి అధికార యంత్రాంగం సహకరించాలని వాకర్స్ కోరారు.




## జేఎన్టీయూహెచ్ మహిళా బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

### దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు సన్నాహాలు

### హుబ్లీలో జరిగే పోటీలకు జట్టు ఎంపిక

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం లోపలి క్రీడా ప్రాంగణంలో శనివారం దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ మహిళల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన జట్టు విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనుందని క్రీడా మండలి కార్యదర్శి ఆచార్య ఎన్.ఎస్. దిలీప్ తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని, ఇలాంటి ఎంపిక పోటీలు క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపిక పరీక్షల్లో వివిధ కళాశాలలకు చెందిన మహిళా క్రీడాకారిణులు, వ్యాయామ సంచాలకులు, శిక్షకులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను ఎన్.ఎస్. దిలీప్ ఆధ్వర్యంలో, సహాయ ఆచార్యులు డాక్టర్ నల్లగొండ అశోక్ సమన్వయంతో నిర్వహించారు.

## గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట జూనియర్ డాక్టర్ల నిరాహార దీక్ష!




**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం):**

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట జూనియర్ డాక్టర్లు తమ ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తమకు రావాల్సిన స్టైపెండ్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు రూ. 29,972 చెల్లించాల్సి ఉండగా కేవలం 5వేలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా నిరాహార దీక్షలో పాల్గొంటున్న రోజులకు కూడా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని, లేనట్లయితే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు.

# గద్వాల జిల్లా ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే

**జోగులాంబ గద్వాల జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జేపీసీ, ఉద్యమకారులకు సన్మానం**

**అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించిన పార్టీ శ్రేణులు**



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం):**

తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తా నందున్న ఎస్వీఎస్ బ్యాంక్వెట్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్, రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, కురవ విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గద్వాల జిల్లా సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన జేపీసీ నాయకులను, ఉద్యమకారులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ..."గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులను ప్రజలకు చేరువ చేసేందుకే తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ మహత్తర నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో అధికార వికేంద్రీకరణ, పాలనా సంస్కరణల ద్వారా ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు, వారి జీవితాల్లో వచ్చిన మార్పులను గుర్తు చేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉంది." అని పేర్కొన్నారు. అలాగే, "గద్వాల జిల్లా సాధన కోసం జేపీసీలు, ఉద్యమకారులు చేసిన పోరాటం మరువలేనిది. వారి సుదీర్ఘ పోరాటాన్ని గుర్తించిన కేసీఆర్ గారు గద్వాల జిల్లాను స్వయంగా ఏర్పాటు చేశారు. ఈ పదేళ్ల కాలంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ మరియు నర్సింగ్ కళాశాలల రూపకల్పనతో జిల్లా స్థాయి మౌలిక సదుపాయాలు సమకూరాయి. కేసీఆర్ గారు వేసిన అభివృద్ధి బాటలు నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయి" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, అంగడి బసవరాజ్, కురవ పల్లయ్య, కౌన్సిలర్లు సంటెన్న, గువ్వల గోపాల్, నరసింహులు, మోహన్ యాదవ్, చిత్తారి కిరణ్, కమ్మరి రాము, కోటేష్, ఆతుకూరి రెహమాన్, చక్రధర్ రెడ్డి, ప్రతాప్, బీచుపల్లి, యూసఫ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ నాయుడు, లక్ష్మారెడ్డి, రఘు నాయుడు, తిమ్మప్ప గౌడ్, అక్బర్ భాష, మాలిక్, నరసింహులు, గోవిందు, అంజి, వెంకటేష్, రాము లతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జేపీసీ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విజయవాడ కనకదుర్గమ్మకు కరీంనగర్ చేనేత పట్టుచీరల సమర్పణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం):**

అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి నేతృత్వంలో విజయవాడ కనకదుర్గ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి చేనేత వస్త్రాల సమర్పణ శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం సారథ్యంలో 10 రోజులకు గాను 10 చేతులతో నేసిన పట్టు చీరలను అమ్మవారికి సమర్పించారు. చేనేత కళాకారుల చేతి నైపుణ్యంతో తయారైన ఈ చీరలను ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరించనున్నట్లు మెతుకు సత్యం తెలిపారు. చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు పద్మశాలీ కులస్తుల ఆధ్వర్యంలో ప్రతీ ఏటా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సాంప్రదాయాన్ని చాలా సంవత్సరాలుగా పూర్వీకుల నుండి కొనసాగిస్తున్నామని మెతుకు సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, దుష్యంతల, బొల్ల శివశంకర్, రాపోలు సుధాకర్, బొద్దుల లక్ష్మణ్, గుర్రం శ్రావణ్ కుమార్, గుంటక రూప, మెతుకు మంజుల రాణి, పోరండ్ల శారద, నోముల రేఖ, చిన్నకోట్ల స్వప్న, గుర్రం విశ్వేశ్వర్ రావు, కర్నాటి విజయ్, కైరంకొండ ఉదయ్, మెతుకు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## పెద్ద చింతరేవులలో ఆంజనేయ స్వామికి మహాలయ అమావాస్య ప్రత్యేక అభిషేక పూజలు

**వేలాదిగా పాల్గొన్న భక్తులు....**

**ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద పంపిణీ**

**ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు...**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింత రేవుల గ్రామంలో 15వ శతాబ్దంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి వారికి మహాలయ అమావాస్య రోజు శనివారం స్వామివారికి బ్రహ్మ ముహూర్తంలో పంచామృత అభిషేక పూజలు,ఆకు పూజలు ప్రత్యేకంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించిన ప్రతి భక్తునికి పెద్ద చింత రేవుల అన్నప్రసాద ట్రస్ట్ వారిచే భక్తులందరికీ దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్వామివారికి భక్తులు దాసంగం రూపంలో భక్తి యుక్తంగా అన్నప్రసాదాన్ని సమర్పణ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భజనలు కీర్తనలు భక్తులు ఆలపించారు. కర్ణాటక ప్రాంతం నుండి వచ్చిన భక్తులు, మరియు భజన మండలి సభ్యులు ఆలయంలో ప్రత్యేక భజనలు చేశారు. రాత్రి వేళలో భక్తులు స్వామివారి సన్నిధిలో బస చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆద్య కిష్టా చారి, ఆద్య మద్వాచారి మరియు పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు,మహిళలు చిన్నారులు వేలాదిగా పాల్గొన్నారు.




## బాలానగర్‌లో కనుల పండువగా 'ఎంగిలిపూల బతుకమ్మ' సంబరాలు..!

**ఆడపడుచులతో జతకట్టి బతుకమ్మ పాటలతో ఆడిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

బాలానగర్ డివిజన్‌లో 'ఎంగిలిపూల బతుకమ్మ' వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్ప రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పులి శ్రీకాంత్ పటేల్, బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాలకు మహిళలు, ఆడపడుచులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఇందిరమ్మ చీరలు ధరించి ప్రత్యేక ఆకర్షణంగా నిలిచారు. బాలానగర్ పరిసరాల నుంచి మహిళలు, ఆడపడుచులు తీరొక్క పువ్వులతో అద్భుతంగా అలంకరించిన బతుకమ్మలను ఇళ్ల నుంచి డప్పు చప్పుళ్ల మధ్య దుర్గామాత ఆలయం ప్రాంగణానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ఆవరణలో బతుకమ్మలను మధ్యలో ఉంచి, వృత్తాకారంలో తిరుగుతూ... 'చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా', 'మా తల్లీ బతుకమ్మ...' అంటూ శ్రావ్యంగా పాటలు పాడుతూ, ఉత్సాహంగా ఆడిపాడిన తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ బతుకమ్మ ఆటపాటలు తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను సజీవంగా ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ, "తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందని, ముఖ్యంగా తెలంగాణ ఆడపడుచులకు ఇది ఎంతో ప్రత్యేకమైనది" అన్నారు. నేటి సంబరాలు మన సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నాయని, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవితంలో ఒక అవిభాజ్య భాగం అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, శాంతియుతంగా సాగేలా పర్యవేక్షించిన బాలానగర్ పోలీస్ ఎస్ఐలు మనోహర్ రెడ్డి, హాజీ మియా, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికారప్రతినిధి మధు మోహన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు ఏరపుల మహేందర్, మహమ్మద్ హాజి, పులి శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, దాండు రవి గౌడ్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## బీజేపీ, బీఆర్ఎస్‌ది మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం):**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. గత 20 ఏళ్లుగా ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి చూపకుండా పరస్పర విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గత పాలకవర్గం అవినీతికి పాల్పడిందని నేడు బీఆర్ఎస్ నేతలే అంగీకరిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటప్పుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ అవినీతిని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలు పరస్పరం సహకరించుకోలేదా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ వ్యవహారాల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇటీవల నీటి విడుదల అంశంపై బీజేపీ ఆందోళన చేయడం, తాజాగా బీఆర్ఎస్ నేతలు మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడికి యత్నించడం రాజకీయ డ్రామాలో భాగమేనని కోమటిరెడ్డి విమర్శించారు. రెండు పార్టీలు ప్రజా సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. మునిగిపోతున్న రెండు నావలపైకి ఎక్కేందుకు ఎవరూ సిద్ధంగా లేరని, పార్టీల్లో చేరికల పేరుతో చేస్తున్న ప్రచారమంతా బూటకమని వ్యాఖ్యానించారు. రెండు పార్టీల మధ్య జరుగుతున్న రాజకీయ వ్యవహారాలు ప్రజలకు అర్థమయ్యాయని, ఇకపై ఇలాంటి రాజకీయాలు సాగవని అన్నారు. బీజేపీ పాలకవర్గం ప్రజా సమస్యలను పట్టించుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటుందని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక





**డాక్టర్.వి.వనజా నరేందర్ రెడ్డి**

**అల్ఫోర్స్ విద్యాసంస్థ ఆద్వర్యంలో బతుకమ్మ వేడుకలు**

**పూల సింగిడి.. నేటినుంచి 18 వరకు బతుకమ్మ సంబురాలు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం):**

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కాలేజెస్ వారి ఆధ్వర్యంలో మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసి, దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ ఉత్సవాలకు వారి సతీమణి డాక్టర్.వి.వనజా నరేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయం లో భాగంగా ఎడురోజుల బొడ్డమ్మ పండుగ జరుపుకోని ఎడవ రోజు నిమజ్జనం చేయడంతో పండుగ ముగుస్తుంది. ఎంగిలి పువ్వుల బతుకమ్మ చిన్న (బతుకమ్మ) తోమ్మిది రోజులు సంప్రాదాయ బద్దంగా తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని చాటి చెప్తుందని తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతకమ్మలను పేర్చి మహిళలు భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో వేడుకలను నిర్వహింస్తారు. అదే విధంగా భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన సాంప్రదాయ జానపద నృత్యాలలో దాండియా ఒకటని, భారతదేశం అంతటా ప్రజాదరణ పొంది సాధారణంగా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ నృత్యం ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తుందని సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తుందని వారు చెప్పారు. బతుకమ్మ వేడుకల్లో సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, మహిళలు భక్తిశ్రద్ధలతో బతకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలను నిర్వహింస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థ ఆద్వర్యంలొ నిర్వహించడం ఒక గొప్ప ఆనవాయితీ అని నేటికీ ఆ సంస్కృతిని పాటించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. చాలా అద్భుతంగా నిర్వహించిన వేడుకలలో భాగంగా ఆలపించిన పలు బతుకమ్మ పాటలు దాండియా పాటలుదేశం లో భాగమైన మన రాష్ట్ర సంస్కృతిని చాటి చెప్పాయని వారు చెప్పారు. అద్భుతమైనటువంటి కళాత్మక బతకమ్మలను దాండియా నృత్యాలు చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు , విద్యార్థులు కాలని వాసులు, తదితరులు పాల్గొన్నారు



## నపారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో అన్నదాన కార్యక్రమం

**ప్రారంభించిన మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

నపారి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నపారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో పేదల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యకార్యమని, సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న నపారి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, ఖాజా పటేల్, తూము ప్రవీణ్ పటేల్, సుందర్, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, అడివయ్య, కృష్ణ, రమేష్, సతీష్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీఐఐసీ భూములకు "చంద్ర" గ్రహణం!








## పారిశ్రామికాభివృద్ధి ముసుగులో పేదల భూములపై పెత్తనం

## గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెం. 27 అసైన్డ్ భూముల్లో నిబంధనలు గల్లంతు.. రైతులకు అందని పరిహారం

## గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోనూ ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

## తెరవెనుక చక్రం తిప్పుతున్న అదృశ్య శక్తులు.. దళారుల దోపిడీకి అధికారుల వంత!

## ఆన్‌లైన్ పేరిట కల్లబొల్లి కబుర్లు.. క్షేత్రస్థాయిలో అక్రమ కేటాయింపులు..!!?

## "ప్రభాత ఉదయం" ఎఫెక్ట్ తో ఫెన్సింగ్ తొలగింపు

**పటాన్ చెరు, అక్టోబర్ 9( ప్రభాత ఉదయం):**

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఊతమివ్వాల్సిన తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) భూములకు ఇప్పుడు "చంద్ర" గ్రహణం పట్టుకుంది! పారిశ్రామిక వికాసానికి బాటలు వేయాల్సిన యంత్రాంగం, తెరవెనుక కొందరు పెద్దలు, చక్రం తిప్పుతున్న 'చంద్ర' శక్తుల కనుసన్నల్లో పనిచేస్తోందన్న విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. అటు కష్టపడి సాగు చేసుకునే పేద రైతుల భూములను లాక్కోవడం, ఇటు నిబంధనలను బుట్టదాఖలు చేసి వ్యక్తులు, బినామీల పేరిట వాటిని అప్పనంగా కట్టబెట్టడానికి అనువుగా ఓ ప్రణాళికాబద్ధమైన 'గ్రహణం' నీడలు కమ్ముకున్నాయని స్థానికులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

**బాధితులుగా అన్నదాతలు.. పరిహారానికి గ్రహణం!**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని అల్లీనగర్ పరిధిలోని సర్వే నెంబర్ 27లో అసైన్డ్ భూములు సాగు చేస్తున్న పేద రైతుల జీవితాలు చీకటిమయంగా మారాయి. ఇక్కడి రైతు సత్తయ్యకు చెందిన 9 ఎకరాల భూమితో పాటు, ఆగ్రారం రాములుకు చెందిన అసైన్డ్ భూమిని అధికారులు గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. అయితే ఏళ్లు గడుస్తున్నా బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. తమ భూములను అప్పగించి కన్నీరుమున్నీరవుతున్న రైతుల గోడు పట్టించుకోని అధికార యంత్రాంగం, కార్పొరేట్ శక్తులకు, పైరవీకారులకు మాత్రం సాగిలపడుతుండటం ఈ 'చంద్ర గ్రహణం' విష సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తోంది. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో బహిరంగ మార్కెట్లో ఎకరం భూమి సుమారు 8 కోట్ల రూపాయల ధర పలుకుతోంది.కాగా అసైన్డ్ భూములపై కన్నేసిన సదరు దళారీ, రైతులను భయభ్రాంతులకు గురి చేసి కేవలం లక్షల రూపాయలు ఇచ్చి భూములను దక్కించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రాంతంలో సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల మేర టిజిఐఐసి కి నష్టం వాటిల్లింది. ఈ విషయం గురించి అంతా తెలిసికూడా సంబంధిత శాఖ అధికారులు కళ్ళుమూసుకుని వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలు తుంగలోకి.. 'వ్యక్తుల'కే అగ్రతాంబూలం!**

టీజీఐఐసీ నిబంధనల ప్రకారం సేకరించిన పారిశ్రామిక భూములను ఎలాంటి పరిస్థితుల్లోనూ వ్యక్తుల పేరిట కేటాయించకూడదనే పక్కా చట్టాలు ఉన్నాయి. కానీ సర్వే నెంబర్ 27 పరిధిలో ఆ నిబంధనలకు పాతరేసి, అదృశ్య శక్తుల అండదండలతో నేరుగా వ్యక్తుల పేర్లతోనే భూములను కట్టబెట్టినట్లు తీవ్రమైన ఆరోపణలతో కూడిన విమర్శలు స్థానిక రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తెరవెనుక మంత్రాంగం నడిపిస్తూ, కోట్ల రూపాయల విలువైన భూములను అడ్డగోలుగా పందేరం చేస్తున్నారనే విమర్శలు మిన్నంటుతున్నాయి. ఇదే సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూములను ఇప్పటికే పలు పరిశ్రమలకు ఆభూములను కేటాయించారు అందులో భాగంగా సూరజ్ కేబుల్ ప్రైవేట్ లిమిటెడ్ కు 3 ఎకరాలు,టార్క్ ఇండియా పరిశ్రమకు 2 ఎకరాలు, ప్రోసెస్ టెక్నో వాల్స్ పరిశ్రమకు 2 ఎకరాలు, ఎస్డీ పరిశ్రమకు 2 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే.

**భూదాహం ఆగదా.. మరో 20 ఎకరాల కోసం ప్రతిపాదనలా.?**

ఇప్పటికే 2015లో సర్వే నెంబర్ 27 లో 20 ఎకరాలు, 2023లో మరో 9 ఎకరాల భూమిని ప్రభుత్వం టీజీఐఐసీకి కేటాయించింది. అయితే ఈ భూదాహం ఇంతటితో ఆగలేదు. తాజాగా మరో 20 ఎకరాల భూమిని సైతం టీజీఐఐసీకి కేటాయించాలంటూ సంబంధిత అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం గమనార్హం. గతంలో రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములు సాగు చేస్తున్న పేద రైతుల కడుపు కొట్టిన అధికారులు, ఇప్పుడు మరోసారి భూసేకరణ పేరుతో దళారులకు మేత వేసేందుకు రంగం సిద్ధం చేయడం గమనార్హం.

**కాగితాలపై టీఎస్-ఐపాస్.. నేలపై దళారుల రాక్షసత్వం!**

ఈ మొత్తం వ్యవహారంపై టీజీఐఐసీ అధికారులను వివరణ కోరగా--- "భూముల కేటాయింపు కోసం ఎవరూ దళారులను ఆశ్రయించాల్సిన పనిలేదు, టీఎస్-ఐపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా దరఖాస్తు చేసుకోవచ్చు" అంటూ సాదాసీదా వివరణ ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. అయితే కాగితాలపై పారదర్శకత ముసుగు వేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం 'చంద్ర' గ్రహణంలా దాపురించిన పైరవీకారులు, దళారులదే ఇక్కడ రాజ్యంగా మారింది. అధికార వర్గాలతో కుమ్మక్కై కోట్ల రూపాయల భూములను అప్పనంగా దక్కించుకుంటున్న ఈ అక్రమార్కులపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిష్పాక్షిక విచారణ జరుపుతారా? లేక ఈ 'చంద్ర' గ్రహణం నీడలోనే పేద రైతుల హక్కులు శాశ్వతంగా అంతరించిపోవాల్సిందేనా? అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు... నిజాయితీ నిరూపించుకోవాలి ఉంటున్న రైతులు తమకు సాగు చేసేందుకు ఏళ్ల క్రితం కేటాయించిన అసైన్డ్ భూములను నయానోభయానో బెదిరించి లాక్కుని తమకు నష్టపరిహారం ఇవ్వకుండా వేదింపులకు గురి చేస్తున్న దళారీ వ్యవస్థ గురించి విషయం తెలిసి కూడా అటు రెవెన్యూ, ఇటు టిజిఐఐసి అధికారులు స్పందించకుండా కాలయాపన చేయడం పట్ల స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు ప్రభుత్వానికి ఆదాయానికి కోట్ల రూపాయల మేర గండి పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తమపై వస్తున్న ఆరోపణలు సరైనవి కావని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఎలా స్పందిస్తారో ఎదురు చూడాల్సిందే.

# శ్రీ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి ఉత్సవ మూర్తులు





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం):**

మహాలయ అమావాస్య సందర్భంగా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం**

అమవాస్య సందర్భంగా పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభిషేకం, దీక్షా హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్రస్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి.. ఇద్దరు కోమాలోకి.. మరికొందరికి గాయలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం):**



మృతుడు నాగన్న



మృతుడు యేసేపు



ఫోన్లో ప్రమాద విషయాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కర్ణాటక రాష్ట్రం యాదిగిరి జిల్లా బెండిగొమ్ముల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా బతుకు దెరువు కోసం కర్ణాటకకు వలస వెళ్లిన జోగుళాంబ గద్వాల జిల్లా ఇందువాసి గ్రామానికి చెందినవారు. ఇందువాసి గ్రామానికి చెందిన సుమారు 35 మంది కూలీలు ఇటీవల ఉపాధి కోసం పత్తి ఏరేందుకు యాద్గిరి జిల్లాకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున కర్ణాటక రాష్ట్రంలోని యాద్గిరి జిల్లాలో సరిహద్దులో గల భారతమాల జాతీయ రహదారి పై కూలీలందరు కలిసి ట్రాక్టర్ పై ప్రయాణిస్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఏసేపు (48) అక్కడికక్కడే మృతి చెందారు. నాగన్న (40) చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలవ్వగా.. మొత్తం 25 మంది గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను రాయచూర్, యాద్గిరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.ఇందువాసి గ్రామానికి చెందిన సుమారు 35 దళిత కుటుంబాలు ఉపాధి కోసం నెల రోజుల క్రితం కర్ణాటకలోని యాదగిరి జిల్లాకు పత్తి ఏరేందుకు వలస వెళ్లాయి. ఈ ప్రమాదంపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పోన్ ద్వార బాధితులతో మాట్లాడారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద దళిత కుటుంబాలు పొట్టకూటి కోసం వలస వెళ్లిన సమయంలో ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం తీవ్రంగా బాధించిందన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకునేలా కర్ణాటక ప్రభుత్వం మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరారు. మృతుడి కుటుంబంతో పాటు గాయపడిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# బల్మూరి వెంకట్‌పై వ్యాఖ్యలను ఖండించిన సునీల్ యాదవ్

## వ్యక్తిగత విషయాలతో రాజకీయం తగదు

## జగన్మోహన్ రావు క్షమాపణ చెప్పాలి

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ పై మాజీ టీఎస్పీఎస్సీ అధ్యక్షులు పాటిమీది జగన్మోహన్ రావు చేసిన వ్యాఖ్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ సీనియర్ యువ నాయకుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షుడు సునీల్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.బల్మూరి వెంకట్ వ్యక్తిగత జీవితాన్ని తెరపైకి తేవడం మంచి పద్ధతి కాదని, వారిద్దరూ నచ్చకనే విడిపోయారని, ఆ తర్వాతే వెంకట్ మరో వివాహం చేసుకున్నారని, ఈ విషయం కూకట్ పల్లి ప్రజలందరికీ తెలుసని అన్నారు.రెండు నెలల క్రితం జగన్మోహన్ రావు ఇంటి ముందే ఒక మహిళ రోడ్డుపై కూర్చుని తనకు న్యాయం చేయాలని, తనను హింసిస్తున్నారని ఆరోపించిన ఘటనను మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆడబిడ్డలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు.బల్మూరి వెంకట్ ను విమర్శిస్తే నాయకులు మెచ్చి పదవులు ఇస్తారని ఆశపడి ఇలా చేయడం మంచి సంస్కారం కాదని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఎల్లమ్మబండలో భూగర్భ మురుగు కాల్వ అభివృద్ధి పనులకు శ్రీకారం

## ఎమ్మెల్యే గాంధీతో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## పట్వారీ శశిధర్, దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

ఆల్విన్ కాలనీ విభాగం పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, జయనగర్ ప్రాంతాల్లో తరచూ వస్తున్న మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం భూగర్భ మురుగు కాల్వ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.జలమండలి ఆధ్వర్యంలో పాతబడిన కాల్వలను మార్చి కొత్త పైపులైన్లు వేయడంతో పాటు మ్యాన్ హోళ్ల పునర్నిర్మాణం చేపట్టనున్నారు. దీనివల్ల మురుగునీరు పొంగి ప్రవహించే సమస్య తగ్గి స్థానికులకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యం లభిస్తుందని నాయకులు తెలిపారు.శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీతో కలిసి ఆల్విన్ కాలనీ విభాగం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా?'

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం)**

భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

**నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లే!**

దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608